వాసవి క్లబ్ అధ్యక్షుడిగా చక్కా రామకృష్ణ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : వాసవి క్లబ్ మండల అధ్యక్షుడిగా వేములపాడు గ్రామానికి చెందిన చెక్క రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, మరిన్ని మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని చెప్పారు. విద్యార్థిని, విద్యార్థులకు, పేదలకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులకు , 207 ఏ జిల్లా గవర్నర్‌కు, క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. గత ఐదు సంవత్సరాల నుంచి సభ్యునిగా సెక్రటరీగా సభ్యుల సహాయంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సెక్రటరీగా చెక్క కేశవరావు, ట్రెజరర్‌గా దొడ్ల శ్రీనివాసులుశెట్టిని ఎన్నుకున్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

ప్రాంగణ ఎంపికల్లో ఐదుగురికి ఉద్యోగాలు

విశాలాంధ్ర-చీరాల : బెంగళూరుకు చెందిన కోడ్ నెక్స్ సాఫ్ట్వేర్ కంపెనీ ప్రతినిధులు చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఐదుగురు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు భావవ్యక్తీకరణ వంటి అంశాలలో మెరుగైన ప్రతిభ చూపితే ఉద్యోగాలను సులభంగా దర్శించుకోవచ్చు అన్నారు. తొలుత కంపెనీ హెచ్‌ఆర్ కే నయన్, హర్షల ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పరీక్ష, సాంకేతిక నైపుణ్యంపై పరీక్ష నిర్వహించారు. ఇంటర్వ్యూలో ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. బెంగళూరులో విధులకు హాజరవుతారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ బషీర, సిఎస్సి హెచ్ ఓడి డాక్టర్ సౌజన్య ,ప్లేస్మెంట్ ఆఫీసర్ బాజీ షాహిద్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

విశాలాంధ్ర-మార్కాపురం: ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని, అందుకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మార్కాపురం రీజినల్ ట్రాన్స్పోర్ట్ అధికారి అమర్ నాయక్ హెచ్చరించారు. ఆర్టీవో ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ జరిగింది. డీఎస్పి డాక్టర్ ఎం కిషోర్ కుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీవో అమరనాయక్ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో మద్యం తాగకూడదన్నారు. సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మొబైల్ మాట్లాడుకుంటూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలను పరిమిత వేగంతో మాత్రమే డ్రైవింగ్ చేయాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత చాలా ముఖ్యమని డి.ఎస్.పి డాక్టర్ ఎం కిషోర్ కుమార్ అన్నారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మాధవరావు, పట్టణ రూరల్ ఎస్సైలు ఏ శశి కుమార్, ఆర్ సుమన్ పాల్గొన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

బాధితులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-కనిగిరి : అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులకు ప్రయోజనం చేకూరేలా అధికారుల చర్యలు ఉండాలని కోరుతూ ఆర్డిఏ మంజునాథ్‌కు ప్రజాసంఘాల ఐక్యవేదిక తరపున సోమవారం వినతిపత్రం అందజేశారు. కనిగిరిలో రియల్టర్లు నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేసి జనానికి అంటగడుతున్న వ్యవహారం రెవెన్యూ, సబ్ రిజిస్టర్, మున్సిపల్ అధికారులకు తెలియనిదేమీ కాదని, ఇప్పుడు నిబంధనలు పాటించకుండా వేసిన వెంచర్లలో రాళ్లను రెవెన్యూ అధికారులు తొలగించడంతో ప్లాట్లను కొనుగోలు చేసిన లబ్ధిదారులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2019కి ముందు వేసిన వెంచర్లు కన్వర్షన్ ఫీజు చెల్లించకపోతే అపరాధ రుసుముతో వసూలు చేయాలని కోరారు. అసైన్మెంట్ భూముల్లో వెంచర్లు వేసిన రియల్టర్ల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలూరి రమణారెడ్డి, జిపి రామారావు, పి.వి శేషయ్య, డి మల్లికార్జున రావు, బడుగు వెంకటేశ్వర్లు,ఎం.రామకృష్ణయ్య,యు కొండయ్య, జీ బాలిరెడ్డి పాల్గొన్నారు.

వాహనాలను దూరంగా నిలపండి

విశాలాంధ్ర-తాళ్లూరు : దుకాణాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తమ వాహనాలను నిలపాలని ఎస్సై బి ప్రేమ కుమార్ వాహనదారులకు సూచించారు. తాళ్లూరు, తూర్పు గంగవరం గ్రామాలలో సోమవారం ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. వాహనాలను రోడ్లకు ఇరువైపులా నిలిపితే ట్రాఫిక్ సమస్యలు ఏర్పడతాయని ఆయన తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా వాహనాలను దూరంగా నిలవాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ సమస్యలు సృష్టించినట్లయితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వైసీపీ సచివాలయ కన్వీనర్‌గా యాడిక

విశాలాంధ్ర-తాళ్లూరు : వైసిపి సచివాలయ కన్వీనర్‌గా యాడిక శ్రీనివాసరెడ్డి సోమవారం దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని యాడిక తెలిపారు. అనంతరం శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌కు శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మారం వెంకటరెడ్డి,తాటికొండ శ్రీనివాసరావు, మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, శనివారపు శ్రీనివాస్‌రెడ్డి , పి సుమలత శ్రీకాంత్‌రెడ్డి, ఎస్.కె కాలేశావలి, హనుమంతరావు, తూము సుబ్బారెడ్డి, కాశిరెడ్డి, వికాస్, ఎస్.కె ఫత్తు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద మెనూ అమలు పరచాలి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలలో అమలు పరుస్తున్న జగనన్నగోరుముద్ద మెనూ ప్రకారం అమలు జరగాలని, అమలు జరపని కుకింగ్ హెల్పర్ల పై చర్యలు తీసుకుంటామని ఎంఈవో బి మస్తాన్ నాయక్ హెచ్చరించారు. తన కార్యాలయంలో సోమవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. కుకింగ్ హెల్పర్లు మెనూ అమలుపరచడంలో నిర్లక్ష్యం చేస్తే మార్చడం జరుగుతుందని, నిబంధనలు మేరకు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. యు డిస్క్ ఈ నెల 26వ తేదీ లోపల పూర్తిచేయాలని, ఎటువంటి తప్పులు లేకుండా పాఠశాలల సమాచారం ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు.

అలాగే ఎస్ ఏ 1 ఫలితాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, సి ఆర్ యాప్ నందు టికెట్స్ క్లోజ్ చేయాలని సూచించారు. పాత్లావత్. మెహంతా నాయక్, సన్నిధి కిషోర్ కిరణ్ కుమార్, ఎస్ కే సలాం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హీరోయిన్ పాయల్ రాజ్ పుత్‌కు శుభాకాంక్షలు



విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హైదరాబాద్ పట్టణంలోని ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గ పరిధిలో ఉన్న హనుమంతునిపాడు మండల జడ్పీటీసీ డాక్టర్ దద్దాల నారాయణ సోమవారం (ఆర్ఎక్స్ 100) సినిమా హీరోయిన్ పాయల్ రాజ్ పుత్‌ను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కొనకనమిట్ల ఎస్సైగా దీపిక

విశాలాంధ్ర-కొనకనమిట్ల : నూతన ఎస్సైగా కె దీపిక సోమవారం కొనకనమిట్లలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమె ఒంగోలు దిశా పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఫణి భూషణ్ ఒంగోలు విఆర్‌కు బదిలీ అయ్యారు.

టీడీపీ నాయకురాలు వెంకట లక్ష్మమ్మ మృతి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : పెద్ద గొల్లపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు పగడాల శ్రీరాములురెడ్డి తల్లి వెంకట లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సర్పారెడ్డి ,మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి కలసి వెంకట లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-పర్చూరు: వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సోమవారం స్థానిక నెహ్రూకాలనీ వద్ద కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మేకా ఆనందకుమారి, మల్లా అంజమ్మ, తోకల కృష్ణమోహన్, ఉప్పలపాటి అనిల్ చౌదరి, గోరంట్ల శివపార్వతి, తులసి నాగమణి, షేక్ అప్సానాభాను, అడపా సుధాకరరెడ్డి, ముప్పాళ్ళ రాఘవయ్య, జెట్టి చంద్రం, జువ్వా శివరామ్‌ప్రసాద్, కటారి అప్పారావు, బండారు ప్రభాకరరావు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో కంభం కళాకారులకు అవార్డులు

విశాలాంధ్ర-కంభం : విశాఖపట్టణం జిల్లా అమలాపురం కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో 2023 సంవత్సర వార్షికోత్సవం సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు, కార్యదర్శి కొరసాల సీతారామస్వామి నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలలో ప్రకాశం జిల్లా కంభం పట్టణానికి చెందిన కళాకారులను అవార్డులు వరించాయి. పఠాన్ ఖాసిం (ఖాసిం ఆర్ట్స్, కంభం) కు ఆర్ట్ లెజెండ్ అవార్డ్, డ్రాయింగ్ మాస్టర్ పిరమిడ్ రాజుకు స్వర్ణ వర్ణ ఇంటర్నేషనల్ గోల్డెన్ లోటస్ అవార్డ్, ఇ.వెంకట్ వెంకట్ (హెయిర్ స్టైల్)కు కె.సి.పి. అవార్డ్, గిద్దలూరుకు చెందిన బట్టి చంద్ర శేఖర్ (శేఖర్ ఆర్ట్స్)కు స్వర్ణవర్ణ గోల్డెన్ లోటస్ అవార్డ్, నాగిరెడ్డిపల్లికి చెందిన ఎ.కోటేశ్వరరావు (కోటి ఆర్ట్స్) కు కె.సి.పి అవార్డ్ అందుకున్న సందర్భంగా రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్ పర్సన్ కుడిపూడి సత్య శైలజా భరత్, మునిసిపల్ చైర్ పర్సన్ అమలాపురం రెడ్డి, సత్య నాగేంద్ర మణి, ఎస్.ఎస్.వి.బి. వసంత రాయుడు, ఆర్.డీ.ఒ. అమలాపురం, కోనసీమ చిత్రకళా పరిషత్ అధ్యక్షులు మెట్లా రమణబాబు, వజ్రగిరి జస్టిస్, అంతర్జాతీయ చిత్రకారులు, పినిపే విశ్వరూప్, ఆంధ్ర ప్రదేశ్ రవాణా శాఖ మంత్రి తదితర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు బహుకరించారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

విశాలాంధ్ర-పీసీపల్లి : వైయస్సార్సీపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని స్థానిక ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఉన్నారు. సోమవారం గుదేవారిపాలెం పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కుల మత పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని అన్నారు. చెరుకూరి ప్రసూన, సతీష్ కుమార్, బొర్రరెడ్డి , మేకల మాల్యాద్రి, వెంకటరావు , మూల రాజశేఖర్, జేమ్స్ రేగుల బాలయ్యపాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక బేతేలుపురంలోని బి.కరుణాకర్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు, కరుణాకర్ కుటుంబం వారు గత వారం రోజులుగా ఊర్లో లేరని గుర్తించిన దొంగలు రాత్రివేళ ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.3 లక్షల నగదు, కొంత బంగారం దోచుకెళ్లారు. కరుణాకర్ ఫిర్యాదు మేరకు త్రిపురాంతకం సీఐ యం.రాంబాబు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఒంగోలు నుంచి క్లూస్ టీమ్ ఎస్ఐ టి.శరత్‌బాబు, అతని బృందం చోరీ జరిగిన స్థలాలో వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు. ఆయన వెంట స్థానిక సీఐ యం.సైదుబాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఊరు వెళితే సమాచారం ఇవ్వాలి: స్థానిక ప్రజలు ఎవరైనా ఊరు వెళితే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వటం, ఇరుగు పొరుగు వారికి చెప్పటం, ఆలారం మోగే తాళాలు వేయటం, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం, అనుమానస్పద వ్యక్తులు తారస పడితే వెంటనే సమాచారం ఇవ్వటం చేయాలని సీఐ రాంబాబు సూచించారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా మహేశ్వరరావు

విశాలాంధ్ర-దర్శి : నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా యాదల మహేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా వినుకొండలో ఆర్ఓగా పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన మంజునాథ్ గౌడ్ ఎమ్మిగనూరు బదిలీపై వెళ్లారు. మహేశ్వరరావును శాసనసభ్యులు డాక్టర్ వేణుగోపాల్, నగర పంచాయతీ చైర్మన్ మర్యాదపూర్వం కలిశారు. సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

కల్తీపాల గుట్టు రట్టు

విశాలాంధ్ర-దర్శి : పట్టణంలో కల్తీ పాల వ్యాపారం గుట్టును రట్టు చేసినట్టు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి తెలిపారు. తనకు అందిన ఫిర్యాదు మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి దాడి చేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నామన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, స్థానిక పొదిలి రోడ్డు ఎల్ఐసి కాలనీలో పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం శావల్యపురానికి చెందిన పూర్ణచంద్రరావు అనే వ్యక్తి గత రెండు సంవత్సరాలుగా ఇల్లు అద్దెకి తీసుకొని ఈ నకిలీ పాల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆవు పాలను సేకరించి వెన్నశాతం పెంపొందించేందుకు పాల పౌడర్, కొన్ని ముడి పదార్థాలు కలిపి డైరీ ఫారాలకు పాలు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారన్నారు. ఇతదిపై 420, 320 కేసులు నమోదు చేసి విచారణ చేస్తామని డీఎస్పి చెప్పారు.

అదేవిధంగా పాల మూలాలను టెస్టింగ్ కొరకు ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. నివేదిక ఆధారంగా నకిలీ పాల వ్యాపారిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని వారు చెప్పారు. నకిలీ పాలు వ్యాపారుల వలన ప్రజల ఆరోగ్యాలు తీవ్రంగా దెబ్బతింటాయని వారిని అదుపు చేయాల్సిన బాధ్యత వినియోగదారులపై కూడా ఉందని అన్నారు. ప్రతి గ్రామంలో నకిలీ వ్యాపారులపై దృష్టి సారించాలని సమాచారం వెంటనే అధికారులకు తెలియజేయాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐ రామకోటయ్య ఎస్సై రామకృష్ణ పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకృతి ఉత్పత్తుల వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తహసిల్దార్ ఎస్ రామ్మోహన్రావు అన్నారు. తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయాల కాంప్లెక్స్‌లో సోమవారం ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకపు మేళ ఏర్పాటు చేశారు. ప్రకృతి సాగులో పండించిన ఉత్పత్తులను అమ్మకం కొరకు ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించిన తహశీల్దార్ రామ్మోహన్‌రావు, ఎస్సై బి ప్రేమ కుమార్, మండల వ్యవసాయాధికారి బి ప్రసాదరావులు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి సాగు ద్వారా పండించిన ఉత్పత్తులను ఉపయోగించిన ట్లయితే ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని, రైతులకు ప్రోత్సాహం అందించడంతోపాటు, వినియోగదారులకు లాభప్రదంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఏర్పాటు చేసే అమ్మకపు మేళాను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. జెడ్‌బిఎస్ఎఫ్ మండల ఇన్చార్జ్ నరసింహులు, ఏఈఓ నాగరాజు, బాపతు వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యాసరచనలో చందలూరు విద్యార్థినికి ప్రథమ బహుమతి

విశాలాంధ్ర-జెవంగులూరు : జిల్లాలోని ప్రభుత్వం, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ మరియు ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఆడపిల్లల కట్టుబాటును కాపాడండి (సేవ్ ది గర్ల్ చైల్డ్ నామ్) అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్/పోస్టర్ ప్రదర్శన, విభాగాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. సుమారు 70 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. చందలూరు హైస్కూల్ నుండి వ్యాసరచన విభాగంలో 10వ తరగతి విద్యార్థిని గొట్టిపాటి సృజన జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. రూ.10 వేల నగదు కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా చీరాల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ నందు జరిగే కార్యక్రమంలో అందజేస్తారు. ప్రధానోపాధ్యాయుడు గుమ్మా శ్రీనివాసరావు, సర్పంచ్ పెండ్యాల కృష్ణారావు, ఎస్ఎంసి చైర్మన్ ముగ్గ కీర్తిశ్రీ,ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

సమాజాన్ని చైతన్యపరిచేవి వేమన పద్యాలు

విశాలాంధ్ర-కొమరోలు : మండల పరిధిలోని కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ఆధ్వర్యంలో వేమన ఫౌండేషన్ అనంతపురం అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఆర్థిక సహాయ సహకారంతో సోమవారం వేమన జయంతి పురస్కరించుకొని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నల్లబోతుల అశ్వనీకుమార్ మాట్లాడుతూ వేమన పద్యాలు సమాజమును చైతన్యపరిచేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని కొనియాడారు. వేమన ప్రజా కవిగా సమాజంలో నిలిచిపోయారని తెలిపారు. వేమన రాసిన పద్యాలు చిన్నప్పటినుండి విద్యార్థిని విద్యార్థులు పాడడం అలవాటు చేసుకోవాలన్నారు. వేమన పద్య పోటీలలో సంజయ్ మోహన్-మొదటి, సి పి రవి- రెండో, డి రజియా- మూడో బహుమతులు గెలుచుకున్నారు. పి నేహా,జాస్నవి, ఎస్ ప్రవీణ, భువర్షిని,పావని, అనుష్క, కావేరిలకు వేమన ఫౌండేషన్ ప్రశంసా పత్రాలు, మూడు మెడల్స్, వేమన పుస్తకాలు అందించారు.ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎంటీ ఆటోమొబైల్ షోరూం ప్రారంభం



విశాలాంధ్ర-ఒంగోలు: ఆర్ఎక్స్100 హీరోయిన్ పాయిల్ రాజ్ పుత్,మొగిలిరేకులు ఫేం ఆర్‌కె నాయుడు సోమవారం ఒంగోలులో హల్‌చల్ చేశారు. స్థానిక త్రోవకుంట సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిఎంటి ఆటోమొబైల్ షోరూంను వారు సోమవారం ప్రారంభించారు. రాజ్‌పుత్ మాట్లాడుతూ తాను ఒంగోలుకు రావటం ఇది మూడవ సారన్నారు. షోరూం మరింతగా ఎదిగి రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో తన బ్రాంచ్‌ను ప్రారంభించాలని ఆకాంక్షించారు. ఆర్‌కె నాయుడు మాట్లాడుతూ తన సీరియల్ ముగిసి చాలా సంవత్సరాలైనా ఇప్పటికీ తనను ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్లకు నమస్కారమన్నారు. బిఎంటి మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ మాట్లాడుతూ కష్టమర్ల సహకారంతో తాను ఈ షోరూంను ప్రారంభించామన్నారు. అన్ని జిల్లాల్లో షోరూంలు ప్రారంభిస్తామన్నారు.గొర్రెపాటి శ్రీను,మండవ శ్రీనివాసరావు, బొలినేని వెంకటేశ్వర్లు, గ్లోబల్ శివ, మండవ మురళి, పులివర్తి వెంకటేశ్వర్లు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, కెఎంబిటి కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.15 లక్షలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,15,349 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.57,040, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22.845, అన్నదానం విరాళం ద్వారా రూ.35,664 వచ్చాయి. అన్నదానానికి కడప జిల్లా చిన్నగురువులూరుకు చెందిన సీతనబోయిన శ్రీనివాసులు శ్రీమతి చిన్నక్క రూ.10,116, ప్రకాశం జిల్లా పామూరు మండలం రావిగుంటపల్లికి చెందిన సింగమనేని కొండయ్య శ్రీమతి నాగమ్మ రూ.10,116 ఇచ్చినట్లు ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి తెలిపారు.

దక్షిణ భారత యూనివర్సిటీ

ఖోఖో పోటీలకు ఎంఎస్ఎం విద్యార్థినిలు

విశాలాంధ్ర-కనిగిరి : దక్షిణ భారత యూనివర్సిటీ మహిళల ఖోఖో పోటీలకు కనిగిరి ఎంఎస్ఎం కళాశాల విద్యార్థులు ఎంపికైనారు. ఈ నెల 24 నుండి 26 వరకు కర్ణాటకలోని అలయన్స్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత యూనివర్సిటీ మహిళల ఖోఖో పోటీల్లో ఆడనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు తెలియజేశారు. వీరు నాగార్జున యూనివర్సిటీలో శిక్షణ తీసుకుంటూ యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న కుమారి, అరుణ, డి శివనాగలక్ష్మి, డి నాగమల్లేశ్వరి, రెండవ సంవత్సరం చదువుతున్న ఈ హేమావతి, బి శిరీష, ఏం దివ్యశ్రీ, టి అహల్య, వి సోనియా ఎంపికైనారు క్రీడాకారిణులను పిడి భవనంకాశీ విశ్వనాథరెడ్డి, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, సిబ్బంది అభినందించారు.

ఆదర్శ నేత సుభాష్ చంద్రబోస్

విశాలాంధ్ర-పామూరు : భావితరాలకు సుభాష్ చంద్రబోస్ ఆదర్శ నేత అని ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుసేన్‌రెడ్డి అన్నారు. నేతాజీ జయంతి వేడుకల సందర్భంగా సోమవారం మండలంలోని కంబాలదిన్నె, లక్ష్మీ నరసాపురం, బొట్ల గూడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి భారతదేశాన్ని విముక్తి చేసేందుకు ఆజాద్ హిందు ఫౌజ్ సంస్థను ఏర్పాటు చేసి పోరాడిన స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. సింగిల్ విండో చైర్మన్ సుజాత, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ కాజా నాయక్ రసూల్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, షేక్ ఖాదర్ బాషా, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై ప్రేమ్ కుమార్‌కు సన్మానం



విశాలాంధ్ర-తాళ్లూరు : నూతన ఎస్సైగా ఇటీవల విధుల్లో చేరిన బి ప్రేమ కుమార్‌ను సోమవారం వైసీపీ మండల సచివాలయాల కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, ఇతర నేతలు కలసి అభినందనలు తెలిపారు. శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు.కొండలు, శ్రీనివాస్‌రెడ్డి, ఫత్తు, తూము రవికుమార్, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

వెనిగండ్ల ఎస్సైకు...

విశాలాంధ్ర-వెలిగండ్ల : నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన వెలిగండ్ల ఎస్సై పి మహేష్ కుమార్‌ను సోమవారం తెలుగుదేశం కనిగిరి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కసునూరి మౌలాలి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. కారు మంచి బాలనాసరయ్య, గంజి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



విశాలాంధ్ర-సింగరాయకొండ : వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవం సందర్భంగా రైల్వే రోడ్‌లోని చెట్టు మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం అమ్మవారికి 1000 కేజీల బియ్యంతో అభిషేకం నిర్వహించారు. తొలుత అమ్మవారి వేష ధారణతో బాలికలు పుర వీధులలో ఊరేగింపుగా వెళ్లి, దేవస్థానంలో అభిషేకం నిర్వహించారు. అ పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...



విశాలాంధ్ర-చీమకుర్తి : హరిహర క్షేత్రంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు సకల దేవతలకు విశేష పూజలు నిర్వహించారు.గణపతి పూజ,పుణ్యాహవచనం, పంచామృత సుగంధ ద్రవ్యాల అభిషేకాలు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూల అలంకారాలు నిర్వహించారు. వాసవి మహిళల ఆధ్వర్యంలో అమ్మవారికి సాముహిక కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు హరి వెంకట కుమారాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.శిద్దా దంపతులకు వేద ఆశీర్వాదాలు అందచేశారు.

మాదిగల సమస్యలపై నిరంతర పోరాటం: పరిశపోగు



విశాలాంధ్ర-మార్కాపురం : మాదిగల సంక్షేమ అభివృద్ధికి నిరంతరం సమరశీల పోరాటాలు చేస్తూనే ఉంటామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పరిశపోగు శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి నియోజకవర్గ ఇన్చార్జి కవలకుంట్ల దయాకర్ మాదిగ అధ్యక్షతన జరిగింది. పట్టణంలోని ప్రధాన వీధులలో కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి, కోర్టు సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదిగల అభివృద్ధికి కారణమైన విద్య, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి వంటి ప్రధాన సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు తాళ్లూరి విజయ్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి కూరపాటి రంగయ్య, జిల్లాలోని అన్ని నియోజకవర్గ మండలాల ఇన్చార్జిలు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

విశాలాంధ్ర-కనిగిరి : స్థానిక గూగుల్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆవరణలో శ్రీ సాయి కృష్ణ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు దోసపాటి నరసయ్య బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెక్రెటరీ రెడ్డి సంధ్య కనిగిరి మండల దివ్యాంగుల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యువగళం యాత్రను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-గిద్దలూరు : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి యువగళం పోస్టర్‌ను ఆవిష్కరించారు. నారా లోకేశ్ ఈ నెల 27న ప్రారంభించనున్న పాదయాత్రకు మద్దతు తెలియచేశారు. ఆయన మాట్లాడుతూ , యువతకు భరోసా కల్పించేందుకు, వెనుకబడిన వర్గాలు,మైనార్టీ వర్గాలు, ఎస్సి ఎస్టీ వర్గాలకు జరిగిన అన్యాయాలను ప్రశ్నించేందుకు లోకేశ్ పాదయాత్ర చేస్తున్నట్టు చెప్పారు. చీకటి జీవోలు తెచ్చిన టీడీపీ శ్రేణులను, ప్రజలను అడ్డుకోలేరన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-వెలిగండ్ల : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు సోమవారం మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యద్దనపూడి సల్మాన్ రాజ్, కె మౌలాలి, కె భాస్కర్ రెడ్డి, కాశయ్య, చందా బాలకాశిరెడ్డి, వెన్న రమణారెడ్డి, కె వెంకటేశ్వర్లు, కొండు భాస్కర్‌రెడ్డి ,కీసరి రమణారెడ్డి, ఆవుల మాలకొండారెడ్డి, పోకల పుల్లారెడ్డి, గంజి రాజశేఖర్ రెడ్డి, గుంతక నాగార్జున రెడ్డి, జి సుబ్రహ్మణ్యం,బత్తుల తిరుపతి రెడ్డి,శెట్టి రామచంద్రయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం...

విశాలాంధ్ర-సీఎస్‌పురం : లోకేశ్ జన్మదిన వేడుకలు స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. సర్పంచి శ్రీరాం పద్మావతి మాట్లాడుతూ, ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ సందర్భంగా లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మన్నేపల్లి శ్రీనివాసులు, నాగిశెట్టి మాలకొండయ్య, పాములపాటి నరసయ్య, నాయుడు నారాయణ, ముప్పాళ్ల శ్రీనివాసులు (మిల్), షేక్ ఖాజీమలాన్, ఎం వెంకటకొండయ్య, బోయన మాలకొండయ్య, కోటగిరి ప్రసాద్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు...

విశాలాంధ్ర-తాళ్లూరు : టీడీపీ మండల అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబులరెడ్డి ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మానం రమేష్ బాబు, సత్యం, టి శివనాగిరెడ్డి, గురువారెడ్డి, ఐవి శ్రీనివాస్‌రెడ్డి, కొండ గురువారెడ్డి, కోటిరెడ్డి, పిన్నిక రమేష్, శ్రీను, నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు...

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని శంకరాపురం గ్రామంలో కూరపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కూరపాటి మహేశ్వరి నారాయణస్వామి, కొక్కెర నాగరాజు, వరగాని పోలు, ఇందూరి పిచ్చిరెడ్డి,మేడికొండ శివశంకరరావు, రామలక్ష్మయ్య, పులిపాడు వెంకటేశ్వరరెడ్డి, నందగోపాల్, పేరం ఆంజనేయులు, మేడికొండ హనుమంతరావు, వట్టి కొండ కోటేశ్వరరావు, గమిడి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పామూరు...

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలోని టిడిపి కార్యాలయంలోనూ, తూర్పు కోడిగుడ్ల పాడు గ్రామంలో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొల్లా మాల్యాద్రి చౌదరి ,అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, మన్నం రమణయ్య, షేక్ కాజా రహమతుల్లా, ఇర్రి కోటి రెడ్డి,పందిటి హరీష్, దారపునేని మాధవరావు, హుస్సేన్‌రావు యాదవ్, నరసింగ సాంబయ్య, ఆర్‌ఆర్ రఫీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు...

విశాలాంధ్ర-ఒంగోలు: నారా లోకేశ్ జన్మదిన వేడుకలు స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలు లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. పట్టణ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరావు,కే. కుసుమకుమారి, తమిశెట్టి రమాదేవి,పెద్దిశెట్టి వరలక్ష్మి రావుల పద్మజ, నాగేంద్రమ్మ, నిడమానూరి పావని, పసుపులేటి సునీత, బోడేపూడి శివప్రసాద్, నల్లమోతు రమేష్, గోపు విరంజినేయులు,నల్లూరి రవి, బోడపాటి వెంకటేశ్వర్లు,నందూరి చంద్ర, కేశన శేషమ్మ,మండవ లావణ్య,గంగవరపు పద్మ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

విశాలాంధ్ర-చీరాల : ప్రజల భావోద్వేగాలతో నిర్మితమైన విశాఖ ఉక్కును కాపాడుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. బత్తుల మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ, తెలుగు ప్రజల భావోద్వేగాలతో, బలిదానాలతో నిర్మితమై ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మన్నికైన,నాణ్యమైన ఫ్యాక్టరీని ప్రభుత్వరంగంలోనే నిలబెట్టుకోవటానికి రెండు సంవత్సరాలుగా విశాఖ స్టీల్ కార్మికులు,నిర్వాసితులు, రాష్ట్రంలోని అన్ని తరగతుల ప్రజలు,రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. 32 మంది బలిదానాలతో, 26 వేలమంది రైతుల త్యాగాలతో, 67 మంది శాసనసభ్యులు,ఏడుగురు పార్లమెంటు సభ్యుల రాజీనామాలతో 'ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు' సాధించబడిందని అన్నారు. 35 వేలమంది పర్మినెంటు, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రత్యక్షంగా,లక్షమందికి పరోక్షంగా ఉపాధి చూపిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 50 వేల కోట్లు పన్నులు చెల్లిస్తున్న సంస్థని అన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కోలా వీరంజనేయులు, వేటపాలెం కార్యదర్శి పి వెంకటేశ్వరరెడ్డి, చీరాల పట్టణ కార్యదర్శి సైకం రాజశేఖర్, సీపీఐ సీనియర్ నాయకులు కోట సుబ్బారావు, చీరాల శాఖ కార్యదర్శి ఎం సాంబశివరావు, చీరాల శాఖ సహాయ కార్యదర్శి తన్నీరు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను అడ్డుకుందాం: అందె

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్: బీజేపీ ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకుందామని సీపీఐ నియోజకవర్గ నాయకుడు అందె నాసరయ్య అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. అనంతరం అందె మాట్లాడుతూ, విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో గతంలో ఎందరో నాయకులు పోరాటాలు చేసి 32 మంది ప్రాణ త్యాగం చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే కార్మికులు భారీ ఎత్తున నష్టపోవాల్సి ఉంటుందని, ప్రైవేటీకరణను అడ్డుకోవలసిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేస్తుందని , కార్మికులంతా ఏకమై బీజేపీ మళ్ళీ అధికారంలోకి రాకుండా అడ్డుకొని ఓడించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు షేక్ ఖాసిం, సీపీఐ యర్రగొండపాలెం నియోజకవర్గ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, దేవండ్ల శ్రీనివాసులు, సీపీఐ నాయకులు దుప్పట్ల కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు

విశాలాంధ్ర-ఒంగోలు: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలనుఎస్పీ మల్లికగర్గ్ స్వయంగా స్వీకరించారు. ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. సంబంధిత స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రతి అర్జీ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి చట్టప్రకారం విచారణ జరిపి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేదింపులు, భూ ఆస్థి వివాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందాయి.

తన ఫేస్ బుక్ (ట్రెండ్స్ మెన్స్ వేర్(బట్టల షాప్),ఎయిర్ కటింగ్ షాపులలో గుమస్తాగా నియమించుకున్న టంగుటూరు మండలం కాకుటూరువారిపాలెం చెందిన ఒక వ్యక్తి దురాశతో షాపుల్లో డబ్బులు చెల్లించుటకు ఉంచిన తమ క్యూఆర్ కోడ్ స్కానర్ మార్చి మరొక క్యూఆర్ కోడ్ స్కానర్ ఉంచి 7 లక్షల రూపాయలు వరకు వేరే అకౌంట్ లకు జమ అయ్యేటట్లు చేసుకొని మోసం చేసాడని టంగుటూరుకు చెందిన టీ. ఆదిలక్ష్మి అనే మహిళా ఫిర్యాదు చేసింది. ఉద్యోగ నిమిత్తం ఒంగోలులోని సాయి బాలాజీ సెక్యూరిటీ వారు నలుగురిని చేర్చుకొని వారిని బల్లికురవ మండలంలోని ఒక గ్రానైట్ కంపెనీలో రెండు నెలలు సెక్యూరిటీ గార్డ్ డ్యూటీ చేయించుకొని డబ్బులు అడుగుతుంటే ఇవ్వటం లేదని మార్కాపురం మండలానికి చెందిన టి.వెంకటేశ్వర్లు మరియు మరో ముగ్గురు వ్యక్తులు ఫిర్యాదే చేశారు.

కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి
దేశ సంపద: ఆమ్ ఆద్మీ

విశాలాంధ్ర-ఒంగోలు: దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్న ప్రధానమంత్రి మోదీ... ధనిక,పేద వర్గాల మధ్య అంతర్యం పెంచడంలో సఫలీకృతం అవుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి ఆర్.మణినాయుడు అన్నారు.ముఖ్య కార్యకర్తల జిల్లా సదస్సు స్థానిక కాపు కళ్యాణ మండపములో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మణినాయుడు మాట్లాడుతూ, దేశంలో అవినీతి లేని ప్రజా పాలనను ఏర్పాటు చేయడమే ఆమ్ ఆద్మీ పార్టీ లక్ష్యం అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేయబోతుందని తెలిపారు. సుమారు రూ.13 లక్షల కోట్లు కార్పొరేట్ శక్తుల అప్పులను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర కన్వీనర్ వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక స్థితి దిగజారడంతో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. జిల్లా కన్వీనర్ వి.సుదర్శన్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి ప్రధాన కారణమైన వెలుగొండ ప్రాజెక్టు , కనిగిరి నిమ్స్ ఏర్పాటు, దొనకొండ పారిశ్రామిక కారిడార్, రామాయపట్నం పోర్టు నిర్మాణ జాప్యం, జిల్లాలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లాంటి ప్రధాన ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.కె. పట్టీం, జి.నాగభూషణరావు, దక్షిణ ఆంధ్ర జిల్లాల జోన్-డి కో-ఆర్డినేటర్ మహమ్మద్ అక్బర్ హుస్సేన్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఉదయ భాస్కర్, పార్టీ సలహాదారులు పోతిన వెంకట రామారావు, రాష్ట్ర నాయకులు టి.సేవా కుమార్, ఫణిరాజు, జిల్లా మహిళా కన్వీనర్ బి.కళావతి నియోజకవర్గాల కన్వీనర్'లు తిరుపతిరెడ్డి, టి.రత్నం కె.వెంకటేశ్వరరావు,సయ్యద్ రహమన్ ఖాన్, మత్తయ్య, వి.రవి, వై.విజయ్, పాలపర్తి శ్రీను మండల కన్వీనర్'లు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరిందని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. పసుపుగల్లు లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సర్పంచ్ వరగాని బాల సుందరరావు, ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసి తాతపూడి మోజెస్ రత్నంరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ , బడుగు బలహీనవర్గాల సంక్షేమ మే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టుచెప్పారు. ఇల్లు, వైయస్సార్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి, పింఛన్లు, రైతు భరోసా లాంటి పథకాలు ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. నవరత్నాలతో పేదల జీవితాలలో వెలుగులు నిండాయన్నారు. సీఎం జగన్ సుభిక్షమైన పరిపాలన చేస్తున్నారన్నారు. ఇంటింటికి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బిజ్జం వెంకటసుబ్బారెడ్డి, ఏనుముల వెంకటసుబ్బయ్య, మేడికొండ జయంతి, అంబటి వెంకటేశ్వర రెడ్డి, గోపనబోయిన పిలుపు రాజు, దాసరి పెద్ద అంజయ్య, గర్నపూడి ప్రసన్నకుమార్, బద్రి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ తేలుకుట్ల బ్రహ్మం, వేముల పద్మావతి శ్రీనివాసరావు, వంగల శ్రీనివాసరెడ్డి, జనమాల నాగేంద్ర పిచ్చయ్య, కందిమల్ల గీతాంజలి, చొప్పరపు వెంకటేశ్వర్లు, జమ్ముల గురవయ్య, దాసరి ఏలియా చింతా వెంకట శ్రీనివాసరెడ్డి, దుగ్గినేని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక సాగర కాలువ బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి ప్రైవేటు బస్సు ఢీకొట్టగా ద్విచక్ర వాహన దారుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కావేరి ప్రైవేట్ బస్సు దరిశి నుండి హైదరాబాద్‌కు వెళ్తూ ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఎస్సీ కాలనీకి చెందిన కంభంపాటి సాయన్న (27)ను ఢీకొంది. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాల తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య గర్భవతిగా ఉన్నదని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడు పంచాయతీలో శుద్ధి జలమును సరఫరా చేసే కార్మికుడిగా పనిచేస్తున్నాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దరిశి ప్రభుత్వ వైశాల తరలించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

బస్సును ఢీకొన్న మినీ వ్యాన్-నలుగురికి గాయాలు



విశాలాంధ్ర-కురిచేడు : మండలం లోని వెంగాయపాలెం తెలంగాణ ఆర్టీసీ బస్సు మినీ ట్రావెల్ ఢీకొని సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వింజమూరు నుండి కామారెడ్డికి వెళ్తున్న బస్సును వినుకొండ నుండి కురిచేడుకు క్యారట్ లోడ్‌తో వస్తున్న మినీ ట్రావెల్ వ్యాన్ వెంగయపాలెం వద్ద బస్సును గుద్దుకోవడంతో బస్సు కిటికీ అద్దాలు రెండు ధ్వంసం అయ్యాయి. బస్సులో ఉన్న నలుగురికి గాయాలు కాగా వారిని ఆస్పత్రికి తరలించి బస్సు డ్రైవరు సిరిసిల్ల స్వామి కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం దేవకుమార్ తెలిపారు.

మృతుడి కుటుంబీకులకు ఓదార్పు

విశాలాంధ్ర-కురిచేడు : బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన కంభంపాటి సాయన్న కుటుంబ సభ్యులను వైయస్సార్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ మేరువ సుబ్బారెడ్డి , రాష్ట్ర మత్స్యకారుల సంఘ అధ్యక్షులు షేక్ సైదా మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం ఓదార్చి తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. సైదా రూ.10,000, సుబ్బారెడ్డి ఐదు వేల రూపాయలు మృతుడి భార్యకు అందజేశారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా శారద

విశాలాంధ్ర-టంగుటూరు : కొండపి వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. స్థానిక సీవీఆర్ ఫంక్షన్ హాలులో సోమవారం ఏఎంసీ చైర్మన్‌గా జీ శారద కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. బాలినేని మాట్లాడుతూ సీఎం జగన్ అన్ని రంగాలలో మహిళలను ముందుకు తీసుకు వెళుతున్నారన్నారు. జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, కొండపి నియోజకవర్గం ఇన్ చార్జ్ వరికూటి అశోక్‌బాబు మరియు నూతన ఏఎంసీ చైర్మన్ గోగినేని శారద వైస్ చైర్మన్ మాలె రంగారెడ్డి కార్యవర్గ సభ్యులు మరియు ఆరు మండలాల అధ్యక్షులు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో నిరుద్యోగ యువతకు
భరోసా కరవు

విశాలాంధ్ర-గిద్దలూరు : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని 15వ వార్డు కొండపేట గ్రామంలో,స్థానిక టీడీపీ నాయకులు సోమవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి, వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, వైసీపీ నియంత పోకడలతో రాష్ట్ర ప్రజలు విసిగెత్తిపోయారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజల పై ఆర్థిక భారాలను మోపుతున్నారన్నారు. నిరుద్యోగ యువతకు భరోసా కరవైందన్నారు. ప్రతీ యేటా జనవరిలో జాబ్ క్యాలండర్ విడుదల చేసి సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన జగన్ నాలుగేళ్లు అయినా ఎన్ని జాబ్ క్యాలెండర్‌లు విడుదల చేశారో చెప్పాలన్నారు. నిరుద్యోగ యువతకు భరోసాగా నారా లోకేశ్ ఈ నెల 27వ పాదయాత్ర ప్రారంభించనున్నారని, అడ్డుకోవాలని చూస్తే టీడీపీ శ్రేణులు ఉద్యమిస్తారన్నారు. మండ్ల శ్రీనివాసులు, షేక్ బాషా, పడకండ్ల శ్రీనివాసులు, మద్దిలేటి, మీనిగ లింగయ్య, పెద్ద కాశయ్య,యర్రబోయిన నన్నూ, ఆవులమంద రమేష్, పుల్లారెడ్డి, నన్నెసాహెబ్, సయ్యద్ శానేషా వలి, పాలుగుళ్ల చిన్న శ్రీనివాసరెడ్డి, బిల్లా రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

డ్యాన్స్‌లో 'చందు అకాడమీ' సత్తా

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక లాయర్ పేటలో గల చందు డాన్స్ అకాడమిలో నృత్య విద్యార్థులకు సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. గుంటూరు చిలకలూరిపేట కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ పోటీలలో చందు డ్యాన్స్ అకాడమీ- ఒంగోలు విద్యార్థులు పలు బహుమతులు సాధించారు. ఈ నెల 6, 7, 8, తేదీలలో పోటీలు జరగగా నిర్వాహకులు సోమవారం బహుమతులను విజేతలకు అందజేశారు. ఈ ఏడాది 38వ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించగా క్లాసికల్ సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి నిడమానూరు ఝాన్సీ , తృతీయ బహుమతి జి కళ్యాణి, క్లాసికల్ జూనియర్ వివాహంలో ప్రథమ బహుమతి ఆర్ హన్సిక, క్లాసికల్ సీనియర్ గ్రూప్ విభాగంలో ద్వితీయ బహుమతి క్లాసికల్ జూనియర్ గ్రూప్ విభాగంలో తృతీయ బహుమతి కళాకారులు సాధించారని నృత్య గురువులు త్రోవగుంట చందు తెలిపారు. పోటీలకు కోఆర్డినేటర్లుగా కోవెలకుంట బాలకోటయ్య జి సాగర్ వ్యవహరించారు. విద్యార్థులను ప్రముఖ రచయిత పి అరుణ, ప్రముఖ కవి నూనె అంకమ్మరావు, కుర్ర ప్రసాద్‌బాబు తదితరులు అభినందించారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

విశాలాంధ్ర-పామూరు : ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నదని ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఒకటో సచివాలయం పరిధిలో పోలేరమ్మ గుడి వీధిలో 20 లక్షల సచివాలయ నిధులతో మంజూరైన సిమెంట్ రోడ్డుకు సర్పంచ్ అల్లూరి రాజమ్మ ఉపసర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్ లతో కలిసి ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల కోసం సంక్షేమం అందిస్తూ మరోవైపు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుచున్నదన్నారు. వైస్ ఎంపీపీ షేక్ రషీద్, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్,కాజా నాయబ్ రసూల్,చల్లా సుబ్బారావు, యాటా రాఘవేంద్ర, తుపాకుల ఆంజనేయరెడ్డి, గుర్రం వెంకటేశ్వర్లు, షేక్ హాజీ మలన్ నీరుకట్టు నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం వైఎస్ఆర్ బీమా

విశాలాంధ్ర-కనిగిరి : వైయస్సార్ బీమా పేదప్రజలకు వరమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు కాశిరెడ్డి నగర్‌లో చలంచర్ల అల్లూరమ్మ (40) సంవత్సరాల సహజ మరణం చెందగా ఆమె వైఎస్ఆర్ బీమా కింద మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ పరిహారంగా కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. అలాగే మిగిలిన క్లైమ్ మొత్తం రూ.90 వేలు నామిని ఖాతాకు త్వరలో జమచేయడం జరుగుతుందని అందుకు అవసరమైన పత్రాలను సంబంధిత సచివాలయంలో అందచేయాలన్నారు. వాసు బాబు, రమేష్ బాబు, మురళీ కృష్ణ, అంజయ్య, చిన్న కొండయ్య,మల్లయ్య, వెంకట సుబ్బయ్య, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమంచికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-మార్టూరు : పర్చూరు నియోజకవర్గ ఇన్చార్జిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమంచి కృష్ణమోహన్‌కు మార్టూరు వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి మార్టూరుకు వచ్చారు. ప్రజలసమస్యలు తెలుసుకుంటూ వెంటనే పరిష్కరిస్తానాని ఆమంచి భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ మండేలా కృషి చేస్తానన్నారు. కూరగాయల మార్కెట్ యార్డ్లో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలేశావలి సులేమాన్, రాకోల్ రామారావు, కాకోల్ వెంకటేశ్వర్లు, షేక్ గన్నవరం బుడే, రాజా నాయక్, బాబునాయక్, సుజ్ఞానమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు భరోసా టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర-పొన్నలూరు : యువతకు ఉద్యోగ భరోసా టీడీపీ తోనే సాధ్యం అని ఆ పార్టీ మండల అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కూడలిలో సోమవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న యువగళం పేరుతో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు 400 రోజులు 4000 కిలోమీటర్లు లోకేశ్ పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం యువతను మోసం చేసిందని గుర్తుచేశారు. మండవ ప్రసాద్, కర్ణా కోటిరెడ్డి, తానికొండ మహేంద్ర, నేలపాటి బ్రహ్మయ్య, కుర్రా మాల్యాద్రి, ఉన్నం శ్రీను, పాతూరి కోటయ్య, పసల రమణయ్య పాల్గొన్నారు.

నారా లోకేశ్ జన్మదినం

విశాలాంధ్ర-మార్టూరు : ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు తనయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఏలూరు క్యాంప్ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల నడుమ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఘనంగా నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు కామేపల్లి హరిబాబు, శివరాత్రి శ్రీనివాసరావు, పెంట్యాల శ్రీనివాసరావు, ఎస్సీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో....

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో అశోక్‌రెడ్డి కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి నారా లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు...

విశాలాంధ్ర-సంతనూతల పాడు : నారా లోకేశ్ 40వ జన్మదిన వేడుకలు స్థానిక టీడీపీ కార్యాలయం నందు సోమవారం ఘనంగా జరిగాయి. తొలుత త్రిపురాంతక స్వామి అంకాలమ్మ తల్లి దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మద్దినేని హరిబాబు, బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, బాపట్ల పార్లమెంట్ కార్యనిర్మాణ కార్యదర్శి మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు నార్నే మాధవి లత, కార్యదర్శి రావుల సుబ్బారావు, గ్రామ అధ్యక్షుడు బొడ్డు శంకర్, గ్రామ కార్యదర్శి మాదాల శ్రీనివాసరావు, టీఎన్టీయుసీ మండల అధ్యక్షుడు మందాడి వెంకటేశ్వర్లు, బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి నారాయణస్వామి చౌదరి పాల్గొన్నారు.

బేస్తవారిపేట ...

విశాలాంధ్ర-బేస్తవారిపేట : లోకేశ్ జన్మదిన వేడుకలు బేస్తవారిపేటలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీ సోరెడ్డి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సైదులు, ముప్పూరి రాము, షేక్ బాషా, బోయిళ్ల రోషన్ బాబు, దోమల రమణ, పోలిశెట్టి మన్యాలు, ఎస్ ఏ రషీద్, షేక్ సుల్తాన్, సందు రమేష్, బీసు అరుణ్ కుమార్, పొట్టి మాబు, చిలక నాగరాజు, నల్లకాల్వ చౌదరి, బర్రెంకల పెద్ద పాండు, పెన్నుల రాముడు పాల్గొన్నారు.

పాసు పుస్తకాలపై జగన్ ఫొటో... తుగ్లక్ చర్య

విశాలాంధ్ర-పంగులూరు : పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో తుగ్లక్ చర్య అని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జాగర్లమూడివారిపాలెంలో సోమవారం టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఆయన పరామర్శించారు. భూ సర్వే, భూ హక్కు, ట్రూ అప్ చార్జీలు అయోమయానికి గురి చేస్తుందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. రీ సర్వే పేరుతో పాస్ పుస్తకాలపై జగన్ ఫోటో ముద్రించడం అనాగరిక చర్య అని అభివర్ణించారు.

ఆర్టీసీ సర్వీసులు లేనట్టేనా!?

పునరుద్ధరించాలంటూ మండల ప్రజల వేడుకోలు

విశాలాంధ్ర-జెపంగులూరు : చిన్నాచితకా పని మీద మండలం నుండి గ్రామాల ప్రజలు ప్రతిరోజు పట్టణాలకు వెళుతుంటారు. ప్రయాణించడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం, అనుకూలంగా ఉంటుంది. అయితే కరోనా సమయంలో పలు సర్వీసులను రద్దు చేసిన ఆర్టీసీ, తిరిగి కరోనా తగ్గిన తర్వాత చాలా సర్వీసులను పునరుద్ధరించారు. కానీ మండలం నుంచి అద్దంకి, చీరాల, చిలకలూరిపేట వెళుటకు బస్ సర్వీసులను పునరుద్దరించలేదు. పంగులూరు, కోటపాడు, బొల్లాపల్లి, కోలాలపూడి ప్రజలు చిలకలూరిపేట వెళ్ళుటకు పంగులూరు - చిలకలూరిపేట బస్ ఎంతో సౌకర్యంగా ఉండేది. ఎంతో రద్దీగా ఉండే సర్వీస్ ను మరల కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పంగులూరు, చిన్నమల్లవరం, కల్లంవారిపాలెం, బూదవాడ, పాపులూరు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే పంగులూరు- చీరాల బస్ సర్వీసును కరోనా సమయంలో తీసివేశారు. ఈ సర్వీసు ప్రజలతోపాటు విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఈ సర్వీస్ ను ప్రారంభించాలని మండలంలోని పై గ్రామ ప్రజలు కోరుతున్నారు. అత్యంత ఉపయోగకరంగా ఉండే నైట్ హాల్ట్ సర్వీసులలో అద్దంకి- ఇంకొల్లు సర్వీస్ ఒకటి. ఈ సర్వీసు వలన జాగర్లమూడి వారి పాలెం, ముప్పవరం, కొండమూరు, కోటపాడు, జనకవరం, పంగులూరు, ఆరికట్ల వారి పాలెం, గంగవరం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఈ సర్వీస్ ని రద్దు చేయడం వలన అద్దంకిలో రాత్రి 7 గంటలకు మాత్రమే చివరి బస్సు ఉన్నందున ఏడు గంటల లోపు పని ముగించుకోవలసి వస్తుంది. అలా కాని పక్షంలో మరొక రోజు అద్దంకి రావటం లేదా ఆరోజు ఆలస్యంగా ఆటోలో వెళ్ళవలసి వస్తుంది. దీని వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నైట్ హాల్ట్ సర్వీస్ వలన ఇంకొల్లు నుండి అద్దంకి వచ్చే ప్రయాణికులకు ఉదయాన్నే ఆరు గంటలకు బస్సు సౌకర్యం ఉండేది.దీని వలన పై గ్రామ ప్రజలకు ఉదయం ఎనిమిది గంటల లోపు అద్దంకి చేరే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడున్న సర్వీస్ అన్న వలన అద్దంకి వెళుటకు ఉదయం 10 గంటలకు దాటుతుంది. ఈ లోపు అద్దంకి వెళ్లాలంటే ఆటోలే దిక్కు. ఈ సర్వీసులు పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.